Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 288 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :288 | శనివారం 18 అక్టోబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4

## ఈ పథకంలో ప్రజలందరూ

# భాగస్వాములు కావాలి



- 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములు కావాలని సీఎం పిలుపు
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్ట్
- పేదరికం లేని రాష్ట్రమే స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యమన్న చంద్రబాబు
- 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడి
- పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన నిర్మూలన అని స్పష్టం
- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల గురించి ప్రస్తావన

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి-4 జీరో పావర్టీ' (పేదరిక నిర్మూలన) కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, ఎదుగుదలకు సమాన అవకాశాలు కల్పించి, అందరితో సమానంగా ముందుకు సాగేలా చేయడమే అసలైన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రధాన ధ్యేయం కూడా పేదరిక నిర్మూలనేనని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకే తమ కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచే పనిచేస్తోందని తెలిపారు. గడిచిన 16 నెలల్లో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి - మిగతా 3లో



## పంచరామాలు చుట్టేద్దామా!

### కార్తీక మాసం.. ప్రత్యేక టూర్ ప్యాకేజ్

### టూరిజం డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

కార్తీక మాసం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పంచారామాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందిన కార్తీక మాసం శుభ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివద్ధి సంస్థ ప్రత్యేక పంచారామాల టూర్ ప్యాకేజీని ప్రకటించినట్లు వెల్లడించారు. పంచారామాలు (ఐదు పురాతన శివాలయాలు) గొప్ప మత,సాంస్కృతిక వారసత్వాన్ని సూచిస్తాయని, కార్తీక మాసంలో ఈ దేవాలయాలను సందర్శించడం అపారమైన దైవిక ఆశీర్వాదాలను ఇస్తుందని భక్తులు నమ్ముతారన్నారన్నారు. భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన మరియు ఆధ్యాత్మిక, సంతప్తికర తీర్థయాత్రను అందించడానికి పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీలో శ్రీ అమరలింగేశ్వర స్వామి- అమరావతి, సోమేశ్వర స్వామి%-% భీమవరం, క్షీరారామలింగేశ్వర స్వామిం- పాలకొల్లు, భీమేశ్వర స్వామి%-% ద్రాక్షారామం, కుమారరామ స్వామి, -సామర్లకోట పంచారామ క్షేత్రాలు ఉన్నాయన్నారు. కార్తీకమాసంలో ప్రతి సోమవారం విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టూరిజం కేంద్ర రిజర్వేషన్ - మిగతా 3లో




## దివ్యాంగులపై మానవత్వం లేదా బాబూ?

- ..పాలన అంటే ఒక సార్థకత దానిని నాడు వైఎస్సార్.. ఆ తర్వాత వైఎస్ జగన్ హయాంలో చూశారు
- అసమానతలు తొలగించి రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేసింది వైఎస్ జగన్ పాలనలోనే
- మానవత్వంతో పాలన సాగించడం అనేది చూశాం
- వైఎస్సార్‌సీపీ అనేది ప్రజల్లో నుంచి వచ్చిన పార్టీ కాబట్టి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళుతుంది
- వైఎస్ జగన్ పాలనకు పూర్తి వ్యతిరేకంగా చంద్రబాబు పాలన సాగుతుంది.

# 'వడ్డెర్ల'కు మైనింగ్ లీజులు



- విధివిధానాలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు
- ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలి
- గనుల తవ్వకాలను శాటిలైట్, డ్రోన్ల ద్వారా చిత్రాలతో విశ్లేషించాలి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వడ్డెర్ల కులాలకు మైనింగ్ లీజుల కేటాయింపు అంశంపై విధివిధానాలు తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సొసైటీలకు 15 శాతం మేర గనుల్లో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని వచ్చే కేబినెట్ లో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. సీనరేజి, ప్రీమియం మొత్తాల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా - మిగతా 3లో



## డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలు.. సుప్రీం ఆందోళన

- దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి
- సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలి



## గాంధీనే విడిచి పెట్టలేదు, నేనెంత

- ఆర్ఎస్ఎస్‌పై నిప్పులు చెరిగిన ప్రియాంక్ ఖర్గే
- జన సమీకరణల పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నారు
- మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి ప్రముఖులకు ఎదురైన చారిత్రక చేదు అనుభవాలే



## విద్యార్థుల జీఎస్టీ అవగాహన అద్భుతం...

# అభినందించిన సీఎం చంద్రబాబు

- జీఎస్టీ పోటీల విజేతలతో సీఎం చంద్రబాబు భేటీ
- భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనన్న ముఖ్యమంత్రి
- 13 జిల్లాల నుంచి ఎంపికైన 17 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం
- జీఎస్టీ ప్రయోజనాలపై విద్యార్థుల చక్కటి అవగాహన
- సంస్కరణ ఫలాలు అందడానికి సమయం పడుతుందన్న సీఎం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం - మిగతా 3లో



## పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు.. ట్రెండింగ్‌లో '93000'

- భారత్‌కు సంబంధం ఏంటి?
- "అప్పుడు భారత్ ఎదుట.. ఇప్పుడు అఫ్ఘాన్ ముందు
- 'టీమ్ 93000' విషయంలో అప్పుడూ ఇప్పుడూ ఏమీ మారలేదు
- భారత్ సైన్యం పాక్‌ను ఓడించడంతో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది

## వైష్ణవి దేవి ఆలయంలో శుక్రవారం పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 17:**
మండలంలోని పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అభయాంజనేయ స్వామికి ఉదయమే ఆలయ అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం అనంతరం విశేష అలంకరణ నిర్వహించారు. మదనపల్లి పుంగనూరు, కలికిరి, చౌడేపల్లి, చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## కబడ్డీ పోటీల్లో విజేతలు వీరే



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 17:**
మండల కేంద్రమైన చారాలలో శుక్రవారం నిర్వహించిన అండర్ 17 అండర్ 14 డివిజనల్ స్థాయి కబడ్డీ పోటీలలో పలువురు విజేతలుగా నిలిచారు. వారి వివరాలు అండర్ 17 బాలికలు చౌడేపల్లి మండల విద్యార్థులు గెలుపొందగా వీకోట మండలం రన్నర్స్ గా నిలచారు, బాలుర విభాగంలో సదుం రెండవ స్థానంలో చౌడేపల్లి అండర్ 17బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో పలమనేరు ద్వితీయ స్థానంలో గంగవరం అండర్ 14 విభాగంలో బాలురు పలమనేరు విన్నర్స్ వీకోట నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పాల్గొని క్రీడాకారులు అందరికీ రుచికరమైన భోజన వసతి కల్పించారు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక గ్రామ పెద్దలు బాబు నాయుడు విశ్రాంత పీడీ రామచంద్ర చాలా పాఠశాల పిడి రాజేంద్ర మండల కోఆర్డినేటర్ వెంకటేష్ శశి నూర్ అజయ్ డివిజన్లో ఉన్నటువంటి అన్ని పాఠశాలల పీడీలు పీఈటీలు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 17:**
మండల కేంద్రమైన చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ప్రసంగించారు, ఎంపీడీవో లీలా మాధవి ఐసిడిఎస్ సిడిపిఓ రాజేశ్వరిలు ప్రసంగిస్తూ బాలికల సాధికారత వారి శక్తి లింగ సమానత్వము ఫోక్సో చట్టం గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంఈఓలు తిరుమలమ్మ కేశవరెడ్డి ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన రాధమ్మ మండలంలోని అధికారులు బాలికలు పాల్గొన్నారు.

## చారాలలో అట్టహాసంగా ప్రారంభమైన కబడ్డీ పోటీలు

### ప్రారంభించిన గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**
మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివిజనల్‌స్థాయి 69వ ఎస్‌జిఎఫ్ఐ కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కబడ్డీలో తొలి కూత విన్నారు. పలమనేరు డివిజన్లో 10 మండలాలకు చెందిన 44 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి, అండర్ 17 అండర్ 14 బాలురు బాలికలు జట్లు పాల్గొని హోరాహోరీగా పోటీలు నిర్వహించారు. వీటితోపాటు జిల్లా జట్టుకు డివిజనల్ స్థాయి కబడ్డీ ఆటగాళ్లను ఎంపిక చేసే కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు పూల చంద్రమౌళి, విజయభాస్కర్ రెడ్డి, బాబు నాయుడు, పవన్ కుమార్, అర్జున్ రాయల్, వెంకటరమణ, ముని, వెంకటప్ప, పాఠశాల ఉపాధ్యాయులు ఆయా పీడీలు పాల్గొన్నారు



# అమ్మా కృపా లక్ష్మి..

## అభివృద్ధికి సహకరించాలి కానీ.. వ్యక్తిగత దూషణలు ఎందుకమ్మా..?

### -ప్రెస్ మీట్‌లో ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 17:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్ ఆర్సిపి ఇంచార్జ్ కృపా లక్ష్మి... వ్యవహారంలో నిలకడ కనబడలేదని, అందుకు ఆమె నిరంతరంగా పెట్టే ప్రెస్ మీట్లే నిదర్శనమని జిల్లా ఆర్టిఐ అధ్యక్షుడు జయరాజ్ విశ దీకరించారు. శుక్రవారం మండలంలోని విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తామస్‌పై.. కృపా లక్ష్మి చేసిన ఆరోపణలకు కౌంటర్గా తెలుగుదేశం నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొంతకాలంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ తనదైన శైలిలో దూసుకుపోతున్నారని... ఇదంతా పట్టని వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపా లక్ష్మి కి మింగుడు పడకుండా... ఆడదానిపై అమానుషంగా ఎమ్మెల్యే మాట్లాడడం జరుగుతుందని... కొంతమంది మహిళలు వెంట పెట్టుకొని కేసు పెట్టడంపై పునరాల లోచిన చేయాల్సి ఉందని సూచించారు. అమ్మా ...కృపా లక్ష్మి ఎమ్మెల్యేకు మహిళ లంటే గౌరవం ఉందని,అంతేకానీ ఆయన ఏనాడు నీ వస్త్రధారణ గురించి గానీ, మీ ఫ్యామిలీ గురించి గానీ మాట్లాడడం జరగలేదన్నారు. నీకు ఏదైనా ఆధారాలు ఉంటే... మీడియా ముందు ప్రవేశపెట్టాల ని కోరారు. అంతేకానీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేసే అభివృద్ధిపై దృష్టి పెట్టారు గాని.... మీ వ్యక్తిగత విషయాలపై ఆయన ఎన్నడు కించెంత కూడా ఆలోచన చేయలే దన్నారు. ఎస్ఆర్‌పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో




అసెంబ్లీలో నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి అమ్మగారిని హేళన చేసి అవ మానపరిచి మాట్లాడినప్పుడు మీ నీవు ఏమయ్యావు జూపూడి ప్రభాకర్ ఇప్పుడే మో అవాకులు చవాకులు పేలుస్తున్నావు అప్పుడు కనిపించలేదా ఇప్పుడేదో అవ మానం జరిగిపోయింది అని మాట్లాడు తున్నావు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదే జూపూడి ప్రభాకర్ రావు కు ఎస్ఆర్‌పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం హెచ్చరించారు. అనంతరం బూత్ కన్వీనర్ గజేంద్ర మాట్లాడుతూ అయ్యా నారాయణస్వామి నీకు వయస అయిపోయింది. ఎప్పుడు ఏం మాట్లాడతావో ఎవరికీ అర్థం కాదు నీవు చేసిన అక్రమాలు అన్ని మాకు తెలుసు ఎక్కడెక్కడ అపార్ట్మెంట్లో ఉన్నాయో అంతా మాకు తెలుసు మీ గుట్టు విప్పితే అంతా బయటకు వస్తాయి, కాస్త నోరు అదుపులో పెట్టుకోవాలని గజేంద్ర ఆరోపించారు. ఇకనైనా సిగ్గు మాలిన ఆరోపణలు మాని... నియోజక వర్గ అభివృద్ధి కొనసాగింపుకు ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అరుణ్, కార్వేటి నగరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మురళి, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# టేలర్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ అమోఘం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**
కుప్పం పట్టణంలోని టేలర్ హై స్కూల్ విద్యార్థులు అమోఘ ప్రతిభను కనబరచడం పాఠశాల కీర్తి ప్రతిష్టలను పెంచిందంటూ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఉత్తమ ప్రతిభను కనబరిచిన పాఠశాల విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడు తూ చిత్తూరు జిల్లా కేంద్రంలోని పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం నాడు సైన్స్ సెమినార్ జరిగిందన్నారు. జాతీయ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య పారిశ్రామిక, సాంకేతిక విభాగం, పాఠశాల విద్యా శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలి పారు. సైన్స్ సెమినార్ నందు జిల్లా పరిధిలో పలు పాఠ శాలల నుండి పాల్గొని వారి ప్రతిభను కనబరిచినట్టు తెలిపా రు.




కాగా జిల్లా స్థాయిలో అనేక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల తరుపున పాల్గొన్న ఏకైక పాఠశాల కుప్పం టైలర్ హై స్కూల్ మాత్రమే కావడం తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కు చిహ్నంగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. తమ విద్యార్థులు సాంకేతిక పరంగానే కాకుండా క్రీడా పరంగా కూడా ప్రత్యేక ప్రతిభను చాటుకోవడం జరిగిందన్నారు. శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో తమ పాఠశాల విద్యార్థి పాల్గొనడం ఇందుకు నిదర్శనం అన్నారు. తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బర్కత్ జిల్లాస్థాయి క్రీడా పోటీలలో వాలీబాల్ విభాగంలో పోటీ పడడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అటు సైన్స్ సెమినార్ నందు, ఇటు క్రీడలలో ఉత్తమ ప్రతిభ ను కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, వారి ప్రతిభకు మెరుగులు పట్టిన పాఠశాల అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

## చైర్మన్ సర్దార్ భాషకు

### సన్మానం చేసిన మైనార్టీ సోదరులు



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 17:**
కుప్పం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సర్దార్ భాషను షాదీఖానా చైర్మన్‌గా ఎన్నుకోవడం పై ఆనందం వ్యక్తం చేస్తూ కుప్పం పట్టణంలోనీ ఎన్టీఆర్ కాలనీలో ముస్లిం మైనార్టీ సోదరులు సలీం, గౌస్, రిజ్వాన్, అన్వర్‌లు సర్దార్ భాషను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ముందుగా తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంకు, పిఎంకె ఉడా చైర్మన్ సురేష్ బాబుకు, కుప్పం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాకీర్ అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనను సన్మానించి అభినందనలు తెలిపిన మైనార్టీ సోదరులు అభిమానాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని, పార్టీ అధినేత నమ్మకాన్ని కాపాడుకుంటూ, సాటి నాయకుల అభిమానాన్ని నిలుపుకునేలా తమ పదవీ బాధ్యతలను నిర్వహిస్తానని చైర్మన్ తెలిపారు.

### మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించి

### నవంబర్ 7న జరిగే నేరవధిక

## సమ్మెను విరమింప చేయాలి

### ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ నాగరాజు

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**



పలమనేరులో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలమనేరు మహాత్మా గాంధీ పార్క్ లోని మహాత్మా గాంధీకి ఏఐటియుసి మున్సిపల్ కార్మికులు వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తు న్న పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. ఎవరు చేయలేని పనిని చేస్తూ అతి తక్కువ జీతంతో పని చేసుకుంటున్నా పరిశుద్ధ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం. వల్లే వాళ్లనే కార్మికులు వేరే గత్యంతను లేక గద్యంతరం లేక గత్యంతరం లేక సమ్మె చేయవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారు లు సంబంధిత అధికారులు ఉద్యోగం చేసుకొని సమస్యను పరిష్కరించి, నాయకులతో చర్చించి సమస్యను సామ్రాజ్యం కోరు తుందా సామ్రాస్య పూర్వకంగా చర్చించి, ఏడవ తేదీ జరగనున్న సమ్మెను పూర్వం ప చేసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ టిసి నాయకులు తెలుగు పి రఘు బుర్ర మంజునాథ్ బాబు, వి రమేష్ నాయకులు టి.శ్రీని వాసులు, జి.జాన్ ఆనంద, హెచ్. బాబు, సి.మురళి లక్ష్మమ్మ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులపై మానవత్వం లేదా బాబూ?



**తాడేపల్లి:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కమిటీ, అన్ని జిల్లాల అధ్యక్షుల ఆత్మీయ సమావేశం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పులిపాటి దుర్గారెడ్డి, దివ్యాంగుల విభాగం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి.. ఆయన ఏమన్నారంటే..

దివ్యాంగులకు సంబంధించిన ప్రతి సమస్యపై వైఎస్ జగన్ క్షుణ్ణంగా తెలుసుకుంటూనే ఉన్నారు. వైఎస్ జగన్ హయాంలో నిస్సహాయులుగా ఉన్న వర్గాలకు, దివ్యాంగులకు సమాన హక్కులు కల్పించడం, అంతిమంగా దివ్యాంగులకు ఎలా లబ్ధిచేయాలని తపించారు. సాంకేతిక కారణాలతో దివ్యాంగులను ఇబ్బంది పెట్టకుండా, నిబంధనలు సరళీకృతం చేయాలని, అవసరమైన సవరణలు చేశారు. క్యాలెండర్ పెట్టుకుని జగనన్న పాలనలో ఏ నెలలో ఏం వస్తుందని సంక్షేమ లబ్ధిదారులకు హక్కుగా లభించేలా చేశారు.

..పాలన అంటే ఒక సార్థకత దానిని నాడు వైఎస్సార్.. ఆ తర్వాత వైఎస్ జగన్ హయాంలో చూశారు. అసమానతలు తొలగించి రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేసింది వైఎస్ జగన్ పాలనలోనే. మానవత్వంతో పాలన సాగించడం అనేది చూశాం. వైఎస్సార్‌సీపీ అనేది ప్రజల్లో నుంచి వచ్చిన పార్టీ కాబట్టి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళుతుంది. వైఎస్ జగన్ పాలనకు పూర్తి వ్యతిరేకంగా చంద్రబాబు పాలన సాగుతుంది. ఏ రకంగా వడపోసి సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించాలనేది చంద్రబాబు లక్ష్యం. చంద్రబాబు సంక్షేమం అంతా తన కోసం, అయిన వారికే తప్ప నిజమైన లబ్ధిదారులకు కాదు. ఎల్లో మీడియా, ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు చంద్రబాబు చేతిలో ఉన్నాయి.

ఊత కర్రల సాయంతో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. దివ్యాంగుల విషయంలో చంద్రబాబు రాక్షసంగా వ్యవహరిస్తున్నారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సామాజిక భద్రత అనేది లేకపోతే పేద వర్గాలు ఏమవ్వాలి. దివ్యాంగులకు పింఛన్లు అవసరమా అనే చర్చ లేవనెత్తారు చంద్రబాబు. దానికి ఎల్లో మీడియా బాకా ఊదుతోంది. రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను వేధిస్తున్నారు. వికలాంగుల విషయంలో జగన్ ఏనాడు పార్టీలు చూడలేదు. వారికి ఎలా చేయూత ఇవ్వాలి, వారు ఆత్మగౌరవంతో ఎలా బతకాలి అని ఆలోచించారు. వైఎస్ జగన్ పాలన ఈ ఐదేళ్ళు కొనసాగి ఉంటే ఒక కొత్త జనరేషన్ తయారయ్యేది. ఒక మంచి వ్యవస్థలను జగన్ రూపొందిస్తే.. చంద్రబాబు దానిని కుప్పకూల్చారు. వైఎస్ జగన్ పాలనలో నాడు-నేడు పేరుతో స్కూల్స్ అభివృద్ధి జరిగితే ఇప్పుడు ఏం జరుగుతుంది. కురుపాం, తురకపాలెం ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇది క్రిమినల్ నెగ్లిజెన్స్ కాదా.? ప్రభుత్వం దృష్టికి ఇవి రాలేదా..? ఇవి వైఫల్యాలు కావా..? పాలన అనేది ఒక యజ్ఞంలా వైఎస్ జగన్ భావించారు. వైఎస్ జగన్ సంక్షేమ పథకాల డెలివరీ పెడితే చంద్రబాబు లిక్కర్ షాప్‌లు, బెల్ట్ షాపులు పెట్టి లిక్కర్ డెలివరీ చేస్తున్నారు. పోలీస్ వ్యవస్థను కూడా రెడ్ బుక్ పేరుతో నాశనం చేశారు. మళ్ళీ అధికారం రాదని తెలిసి చంద్రబాబు ఆయన కుమారుడు బరితెగించి వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఒక బలీయమైన శక్తిగా రూపొందింది. అందుకు ఉదాహరణే జగన్ పర్యటనలకు వస్తున్న లక్షలాది మంది జనమే. కోటి సంతకాల సేకరణలో మీ విభాగం కూడా సమన్వయంతో పనిచేయాలి. మీ పరిధిలో ఉన్నంత మేరకు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేయండి.

**కూటమి సర్కార్ దివ్యాంగులను మోసగించింది: మేరుగ నాగార్జున**

దేశ చరిత్ర లోనే దివ్యాంగులకు భరోసా, ఆత్మస్థైర్యం కల్పించింది జగనన్న పాలనలోనే. ఏపీలో కూటమి ప్రభుత్వం దివ్యాంగులను మోసగించింది. వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఆసుపత్రుల చుట్టు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. పెన్షన్ల రీవెరిఫికేషన్ పేరుతో వారికి నరకయాతన చూపుతున్నారు. చంద్రబాబు ఇదేనా మానవత్వం. చంద్రబాబు దివ్యాంగుల పట్ల నువ్వు చేస్తున్నది మోసం, దగా కాదా అని ప్రశ్నిస్తున్నాం.

**దివ్యాంగులకు ఇచ్చిన హామీ ఏంటి, ఇప్పుడు చేస్తున్నదేంటి?: పులిపాటి దుర్గారెడ్డి**

చంద్రబాబు దివ్యాంగులను నిలువునా మోసం చేశారు. దివ్యాంగుల పెన్షన్లలో కోతలు, ఆంక్షలతో వేధిస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు నువ్వు దివ్యాంగులకు ఇచ్చిన హామీ ఏంటి, ఇప్పుడు చేస్తున్నదేంటి. లక్షల మంది దివ్యాంగలకు నోటీసులు ఇచ్చి మా దివ్యాంగులను దొంగలుగా చిత్రీకరిస్తున్నావు. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశావ్. జగన్ హయాంలో తలెత్తుకు తిరిగిన మేమంతా ఇప్పుడు ఆత్మాభిమానం దెబ్బతిని బతుకీడుస్తున్నాం. అనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం మీకు సమంజసమా అని నిలదీస్తున్నాం.

# సింహపురిలో సైనికుల తగువలాటలు



**నెల్లూరు :** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ ప్రభావం అంతంత మాత్రమే. 2024 ఎన్నికలకు ముందు అప్పటి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి జనసేనను వీడి వైసీపీలోకి వెళ్లడంతో అప్పటి నుంచి పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, సుజయ్ బాబు, నలిశెట్టి శ్రీధర్, వంటి నాయకులు తప్ప చెప్పుకోదగ్గ నాయకులెవరూ ఆ పార్టీలో లేకుండా పోయారు. దీంతో జనసేన పార్టీ ప్రభావం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పెద్దగా కనిపించేది కాదు. ఉన్న నాయకులే ఏదో ఒక కార్యక్రమంతో జనాల్లోకి వస్తూ పార్టీని ఎంతో కొంత బలోపేతం చేయాలని ప్రయత్నించే వారు. జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో బలోపేతం దిశగా ముందుకెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన నేతల వర్గ విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. జనసేన నేత, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను టార్గెట్ చేసుకొని పార్టీలో మొదటి నుంచి ఉన్న నియోజకవర్గ ఇంచార్జ్‌లందరూ తిరుగుబాటు ఎగుర వేశారు. అజయ్ కుమార్ యాంటీ వర్గం అంతా ఏకమై ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తున్నారు.జిల్లాలో పార్టీని అజయ్ కుమార్ సర్వ నాశనం చేస్తున్నారని.. పార్టీని రోడ్డున పడేస్తున్నారని మండిపడుతున్నారు. తామందరం కష్టపడితే.. లాబీయింగ్ చేసి అజయ్ కుమార్ పదవి తెచ్చుకున్నారనేది ఆయన వ్యతిరేక వర్గం వాదన. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకులందరినీ పక్కన పెట్టేసి తన వర్గానికి చెందిన కొత్త వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని అజయ్ కుమార్ తీరును తప్పుబడుతున్నారు. అంతేకాక జనసేన నియోజకవర్గ ఇంచార్జిలకు పనులు చేయొద్దంటూ..మంత్రులకు, ఎమ్మెల్యేలకు అజయ్ కుమార్ సూచిస్తున్నారని ఆరోపిస్తున్నారు.పార్టీ అధికారంలోకి రావడానికి తామంతా కృషి చేస్తే.. తమ కష్టాన్ని అధిష్టానం దగ్గర తాకట్టు పెట్టి అజయ్ కుమార్ నామినేటెడ్ పదవి తెచ్చుకుని ఇలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. జిల్లాలో పార్టీ కోసం ఏనాడూ పని చేయకుండా, ఇప్పుడు పదవితో నెల్లూరుకు వచ్చి పార్టీలో గ్రూపులు కట్టి, గందరగోళానికి దారితీస్తున్నాడని ఫైర్ అవుతున్నారు. ఎన్నికల సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న గూడూరు వెంకటేశ్వర్లు సైతం అజయ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారట. జిల్లాలో పార్టీని నాశనం చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు అప్ప ట్లో కలకలం రేపాయి. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అజయ్‌పై విమర్శలు వచ్చాయి.వేములపాటి అజయ్‌కుమార్ మొన్నటి వరకు కూడా రాజకీయాల్లో పెద్దగా పరిచయం లేని వ్యక్తి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నాగబాబులతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తి. ప్రభుత్వంలో జనసేన భాగమైనప్పటి నుంచి..నెల్లూరు జిల్లాలో అన్ని తానై వ్యవహరిస్తున్నారట. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేనకు క్యాడర్ ఉంది. కోవూరు, వెంకటగిరి, ఆత్మకూరులో కూడా ఎంతో కొంత కార్యకర్తలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో అజయ్ కుమార్ మరొక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. పవన్ కల్యాణ్, నాగబాబు దగ్గరికి ఎవరినీ పోనివ్వ కుండా..అంతా తానే అన్నట్లు అజయ్ కుమార్ వ్యవహరిస్తున్నారట. ఇదే జనసేన పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న నేతలకు ఆగ్రహం తెప్పిస్తుందట. అజయ్ కుమార్‌ను కాదని ఎవరైనా పవన్ కల్యాణ్‌ను గానీ, నాదెండ్ల మనోహర్‌ను కానీ కలిస్తే వారిని దూరం పెట్టేలా వ్యవహరి స్తున్నారట. అందుకే నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఆధ్వర్యంలో..జనసేన నియోజకవర్గ ఇంచా ర్జ్‌లంతా ఒక్కతాటిపైకి వచ్చి దుమ్మెత్తిపోస్తున్నారట. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలతో..అజయ్ కుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ పార్టీ బలోపేతం చేయకుండా గ్రూప్‌లను ప్రోత్సహిస్తున్నారని మండిపడుతున్నారు. పార్టీ బలోపేతానికి ఒక్క కార్యక్రమం కూడా ఆయన చేయడం లేదట. సొంతంగా కార్యక్రమం చేసేవారిని సైతం అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారట. అజయ్ కుమార్ లాంటి వ్యక్తులు నెల్లూరు జనసేనలో ఉంటే పార్టీ ఎప్పటికీ బలోపేతం కాదని నేతలు అధి ష్టానానికి ఫిర్యాదు చేశారట. సింహపురి జన సైనికుల వివాదంపై పవన్ కల్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# రాధా... ఎందుకింత బాధ



**విజయవాడ :** బెజవాడ నాయకుడు వంగవీటి రాధా రాజకీయంగా చాలా నష్టపోతున్నారు. ఇప్పటికే దశాబ్ద కాలం నుంచి ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ఆయన ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వంగవీటి రాధాకు ఎందుకో రాజకీయ పదవి దక్కడం లేదు. వంగవీటి రంగా కుమారుడిగా బలమైన కాపు సామాజికవర్గం నేతగా వంగవీటి రాధాకు సాధారణంగా పదవి వెతుక్కుంటూ రావాల్సి ఉంది. కానీ వంగవీటి రాధా విషయంలో మాత్రం అలా జరగడం లేదు. అందుకు కారణం కులం కార్డు ఇప్పుడు డైవర్ట్ అయిపోయిందంటున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంట్రీతో వంగవీటి రాధాను పెద్దగా పట్టించుకోవడం లేదని ఆయన వర్గం నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.వంగవీటి రాధా ఇప్పటికే అన్ని పార్టీలూ మారారు. కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైసీపీ, టీడీపీ ఇలా నాలుగు పార్టీలు మారిన వంగవీటి రాధాకు చివరకు పోటీ చేయడానికి కూడా స్థానం దక్కని పరిస్థితి నెలకొనడంతో ఆయన రంగా అనుచరుల్లో బాధ అంతా ఇంతా కాదు. వంగవీటి కుటుంబానికి ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లో ఒక పేరు ఉంది. రంగా పేరుతో పాటు ఆయన విగ్రహాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. రంగాను పేదల దేవుడిగా భావిస్తారు. కేవలం కాపు సామాజికవర్గానికి మాత్రమే కాకుండా రంగాకు అన్ని కులాల నుంచి అభిమానులు ఇప్పటికీ ఉన్నారు. కానీ వంగవీటి రాధా విషయంలో మాత్రం అది రివర్స్ అయిందంటున్నారు. రాధా కూడా పెద్దగా రాజకీయాలను పట్టించుకోకుండా తిరుగుతుండటం అనుచరులను కొంత అయోమయానికి గురి చేస్తుంది.. ఇక ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వంగవీటి రాధాను పిలిపించుకుని మాట్లాడారు. దీంతో వంగవీటి రాధాకు కూడా పదవి రెడీ అయిందన్న ప్రచారం జరిగింది. ఆయనను అందుకే లోకేశ్ పిలిచి మరీ మాట్లాడారంటున్నారు. వంగవీటి రాధా హైదరాబాద్ లో ఉంటే అమరావతికి పిలిచి పదవిపై లోకేశ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గంట సేపు ఇద్దరి భేటీ కొనసాగింది. అయితే ఇటీవల వంగవీటి రాధా తన కుమార్తె వేడుకకు సందర్భంగా కొడాలి నాని, వల్లభనేని వంశీ హాజరు కావడంతో టీడీపీ సోషల్ మీడియాలో కొన్ని నెగిటివ్ కామెంట్స్ కనిపించాయి. అయినా వంగవీటి రాధాను టీడీపీ వదులుకోదని, ఆయనకు పదవి గ్యారంటీగా దక్కుతుందని అంటున్నారు. చూడాలి ఏం జరుగుతుందో?

## ఈ పథకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా రూ. 2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్నా క్యాంటీన్లను' పునఃప్రారంభించి, కేవలం రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. 'దీపం 2.0' పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో, ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు తొలి విడతగా రూ. 7,000 జమ చేశామని, మత్స్యకారులకు రూ. 246 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ. 435 కోట్లు అందించామని ఆయన తన పోస్ట్‌లో వివరించారు.

## 'వడ్డెర్ల'కు మైనింగ్ లీజులు

-మొదటిపేజీ తరువాయి

ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20%-%30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్ తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ కు ముడి ఇనుము ఖనిజం సరఫరా పై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. సమీక్షలో గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

## పంచరామాలు చుట్టేద్దామా!

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయం నుండి ఈ నెల అక్టోబర్ 27, నవంబర్ 03, నవంబర్ 10, నవంబర్ 17 సోమవారం తేదీల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. పెద్దలకు: రూ.2,130 పిల్లలు: రూ.1,760 లు ధర ఉంటుందన్నారు. వీటితోపాటు ప్రతి శనివారం విజయవాడ నుండి వాడపల్లి వరకు ప్యాకేజీ టూర్‌ను పర్యాటక శాఖ నిర్వహిస్తోందన్నారు. బుకింగ్, ఇతర వివరాలకు 98480 07025, 84990 54422 %-% 1800 42545454 పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య ఆ ప్రకటనలో తెలియజేశారు.

## విద్యార్థుల జీఎస్టీ అవగాహన అద్భుతం... అభినందించిన సీఎం చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్నారా..? అని వారిని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. జీఎస్టీ అంశాలపై విద్యార్థుల అవగాహన ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సదుం డిప్యూటీ ఎంపీడీవోగా నాగరాజు



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**

సదుం మండలం డిప్యూటీ ఎంపీడీవోగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పదోన్నతి ఉత్తర్వులను. ఎంపీడీవో రాధారాణికి అందజేశారు. కల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఉన్న నాగరాజుకు ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు మాట్లాడుతూ మండల పరిధిలో పంచాయతీల సమగ్ర గ్రామాభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని అన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**



సమాజంలో బాలికల పట్ల లింగ వివక్షత చూపరాదని పులిచెర్ల సింగల్ విండో చైర్మన్ లెక్కల ధనంజయ నాయుడు అన్నాడు. పులిచెర్ల మండలం పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భం గా సిడిపిఓ వాణి శ్రీదేవి ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానత లు విద్య, పోషణ, చట్టమైన హక్కులు వైద్య సంరక్షణ, హింస, రక్షణ, బలవంతపు, బాల్య వివాహాలు.. తదితరు వాటిపై సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు సింగల్ విండో చైర్మన్ లెక్కల ధనుంజయ నాయుడు, సిడిపిఓ వాణిశ్రీదేవి, ఎంఈఓలు సిద్ధ రామయ్య పోకల తాతయ్య. బహుమతులు అందజే శారు. ఈ కార్య క్రమంలో సూపర్వైజర్ విజయలక్ష్మి,టిడిపి నాయకులు నజీర్, అశ్రూప్, ప్రభాకర్, హెచ్ఎం లక్ష్మీదేవి,పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అక్బర్ వైద్య సిబ్బంది. పురు షోత్తం జీఎస్టీ నోడల్ అధికారి సాబ్ జాన్, ఏఎన్ఎం యశోద, అంగన్‌వాడి కార్యకర్తలు, మొబీనా తాజ్, పార్వతి, సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**
అన్నమయ్యజిల్లా పీలేరు మండలంలోని ఎం.సి. పాలెం నందు ఉచిత పశు వైద్య శిబిరము నిర్వహించారు.దఈ శిబిరములో సుమారు 70పశువులకు డాక్టర్ మునిచంద్రరెడ్డి సిబ్బందితో కలిసి పశువులకు కావలసిన మందులు, మినరల్, మిక్చర్, ఇంజెక్షన్లకు గాను గవర్నర్ లైన్ డా ప్రసాద్ 10000 విరాళము అందజేసారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు లైస్ బి.ఆర్. నాగ బాలాజి, పూర్వపు అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సురేంద్ర నాధ రెడ్డి, శశిధర్ రెడ్డి, సత్యం రెడ్డి, పురం సంబ్రమణ్యం, పామిడి మహేష్, సభ్యులు మెతుకు మనోష్, రెడ్డి రవిలు పాల్గొన్నారు.

## బాల్ బ్యాట్మెంటన్ పోటీలో
## ద్వితీయ స్థానంలో సిఎన్ఆర్ విద్యార్థులు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**
అన్నమయ్యజిల్లా తిరుపతి ఎస్వీ యూని వర్సిటీలో జరిగిన బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో పీలేరుకు చెందిన, సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో గెలుపొందారని కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొని విజయం సాధించే దిశగా ప్రోత్సహించిన కోచ్ అవినాష్ ను అభినందించారు. తమ కళాశాలలో క్రమశిక్షణతో కూడిన చదువు తోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తామని కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొని గెలుపొం దిన జట్టు సభ్యులైన విష్ణువర్ధన్, మహమ్మద్ అలీ, ఖుషి, అబుబకర్ వసీం, వారి స్తులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

# 'ఓఆర్ఎస్' పదాన్ని తొలగించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రత కమిషనర్లు, కేంద్ర లైసెన్సింగ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు (ఎఫ్బీఓలు) తమ ఆహార ఉత్పత్తులపై 'ఓఆర్ఎస్' అనే పదాన్ని తొలగించాలని స్పష్టం చేసింది. ఈ పదాన్ని ఏ రకంగానూ ఉపయోగించవద్దని, ఉత్పత్తి పేరులో ట్రేడ్‌మార్క్‌గానూ వాడకూడదని ఆదేశాల్లో పేర్కొంది. అలా 'ఓఆర్ఎస్ ' పదాన్ని వాడటం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని వెల్లడించింది. సంబంధిత అధికారులందరూ ఈ చట్టం సూచించిన లేబులింగ్, ప్రకటనల అవసరాలకు, దాని కింద రూపొందించిన నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూసుకోవాలని కోరింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ.. ఆహార ఉత్పత్తులైన పండ్ల రసాలు, నాన్-కార్బొనేటెడ్, రెడీ-టూ-డ్రింక్ బేవరేజెస్‌లకు అనుబంధనంగా గానీ, జతగా గానీ లేబుళ్లపై ఉపయోగించేందుకు అనుమతిచ్చింది. అయితే, 'డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన ఓఆర్ఎస్ ఫార్ములా కాదు ' అనే హెచ్చరిక ఉండాలని సూచించింది. అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ మరింత సమగ్రంగా సమీక్షించిన తర్వాత, పండ్ల రసాలు, నాన్-కార్బొనేటెడ్, రెడీ-టూ-డ్రింక్ బేవరేజెస్ వంటి ఆహార ఉత్పత్తుల కోసం ట్రేడ్‌మార్క్ చేసిన పేరులో లేదా మరేదైనా 'ఓఆర్ఎస్' అనే పదాన్ని ఏ విధంగానైనా




ఉపయోగిస్తే ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించడమేనని తాజాగా తెలిపింది. ఇలాంటి పద్ధతులు తప్పుడు, మోసపూరిత, అస్పష్టమైనవని, నకిలీ పేర్లు లేదా లేబుల్ ప్రకటనలను ఉపయోగించి వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరించింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు తక్షణమే నిబంధనలను పాటించేలా చూసుకోవాలని, ఉల్లంఘనలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కూడా ఆదేశించింది.

# తమిళనాడుకు తరలిన ఫాక్స్‌కాన్!

ఒకప్పుడు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఏ విదేశీ సంస్థ ముందుకొచ్చినా తొలుత తెలంగాణను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే.. ఇతర రాష్ట్రాలతో చర్చలు జరపడం ఆనవాయితీ అంటే అతిశయోక్తి కాదు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితి మారింది. నాడు పోటీపడి జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించిన రాష్ట్రం.. నేడు కనీసం ఉన్న కంపెనీల విస్తరణను కూడా నిలుపుకోలేని స్థితికి వెళ్లిపోతున్నది. ఇందుకు ఫాక్స్‌కాన్ సంస్థే తాజా ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి తరలివచ్చిన ఈ తైవాన్ కంపెనీ.. ఇప్పుడు విస్తరణ కోసం తమిళనాడును ఎంచుకున్నది. రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అయితే తెలంగాణలోనే అదనపు పెట్టుబడులు పెట్టేలా కంపెనీని ఒప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఇలా జరిగిందని పరిశ్రమ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడుల గమ్యస్థానంగా మారగా.. ఇప్పుడు ప్రముఖ కంపెనీలు ఇతర రాష్ట్రాలవైపు మళ్లుతున్నాయని చర్చ జరుగుతున్నది. ఇప్పటికే కేన్స్ టెక్నాలజీస్ వంటి పలు దిగ్గజ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన సంగతి తెలిసిందే. తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ (హాన్ హై టెక్నాలజీ గ్రూపు) ప్రఖ్యాత యాపిల్ ఐఫోన్ల తయారీని చేపడుతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్చి 2023లో తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు స్వయంగా వచ్చి, అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతో సుమారు రూ.5 వేల కోట్ల పెట్టుబడితో




ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ ముందుకొచ్చింది. ఒప్పందం ప్రకారం అప్పుడే ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌కు రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో 186.7 ఎకరాలు కేటాయించింది.

# తొక్కిసలాటతో అంతా తలకిందులు..
# అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ?

ఐపీఎల్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 18వ సీజన్‌లో ట్రోఫీని ముద్దాడింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇక ఐపీఎల్‌లో ఆర్సీబీ శకం మొదలైందని అభిమానులు సంబుపడుతున్న వేళ.. ఫ్రాంచైజీని అమ్మేయాలని యాజమాన్యం భావిస్తోంది. మంచి ధర పలికితే ఏమాత్రం ఆలోచించకుండా బెంగళూరు జట్టును వదిలించుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ సంస్థ. ఈ మద్యం కంపెనీకి చెందిన వాటాదారులు ఐపీఎల్‌లో జట్టును కొనసాగించేందుకు అయిష్టత చూపిస్తున్నారట. అందుకే.. ఆర్సీబీని అమ్మేయడమే మంచిదని సంస్థ ఆలోచిస్తోంది. అయితే.. చిన్నస్వామి తొక్కిసలాట, పోలీస్ కేసు తదనంతర పరిణామాల నేపథ్యంలో కొత్తవాళ్లకు జట్టును అప్పగించేం దుకు ఆర్సీబీ యాజమాన్యం సిద్ధపడుతోంది. విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాడు ఉన్న ఆర్సీబీ మార్కెట్ విలువ భారీగానే ఉంది. 'ఐపీఎల్ విజేత' అనే ట్యాగూ ఉండడంతో రూ.1.75లక్ష కోట్లకు ఫ్రాంచైజీని అమ్మాలని డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ పావులు కదుపుతోంది. వామ్మో.. అంత రేటా? అని ఆశ్చర్యపోతున్నారంతా. అయినా సరే ఆర్సీబీని కొనేందుకు ఆరు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. భారత్‌కు చెందిన నాలుగు కంపెనీలతో పాటు అమెరికాకు సంబంధించిన రెండు సంస్థలు కూడా డియాగియో యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 'అడార్ పూనావాలా' (సీరమ్ ఇనిస్టిట్యూట్), జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత పార్థ్ జిందాల్, అదానీ గ్రూప్ యాజమాన్యం రేసులో ఉన్నాయని తెలుస్తోంది. ఐపీఎల్ జట్టును హస్తగతం చేసుకోవాలని పూనావాలా ఫ్యామిలీకి ఎప్పటినుంచో ఉంది.



2010లో ఆడార్స్ తండ్రి సైరస్ జట్టును కొనేందుకు ఇన్విటేషన్ టు టెండర్ కూడా వేశాడు. కానీ, సహారా గ్రూప్, రెండెజ్‌వస్ స్పోర్ట్స్ బిడ్స్ దక్కించుకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో సగం వాటా కలిగిన పార్థ్ జిందాల్ సొంతగా ఒక జట్టుకు బాస్ అవ్వాలనుకుంటున్నాడు. అందుకే.. ఆయన ఆర్సీబీని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు. అదానీ గ్రూప్ కూడా తమకు ఒక ఐపీఎల్ టీమ్ ఉండాలని అనుకుంటోంది. 2022లో బీసీసీఐ కొత్తగా గుజరాత్ టైటాన్స్ లక్నో సూపర్ జెయింట్స్ అనే రెండు ఫ్రాంచైజీలను ప్రకటించింది. అప్పుడు అదానీ గ్రూప్ టైటాన్స్‌ను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నమే చేసింది.

**11 మంది మరణించగా..**

ఐపీఎల్‌లో భారీగా అభిమానగణం కలిగిన ఆర్సీబీ పంతొమ్మిదో సీజన్‌తో తమ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది. అందని ద్రాక్షను పట్టేసిన సంతోషాన్ని అభిమానులతో పంచుకోవాలని ఘనంగా విక్టరీ పరేడ్ నిర్వహించాలనుకుంది కానీ, చిన్నస్వామి స్టేడియానికి ఫ్యాన్స్ భారీగా పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. 11 మంది మరణించగా.. 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకరమైన ఘటనతో ఆర్సీబీ యాజమాన్యం అప్రతిష్టపాలైంది. కనీస భద్రతా జాగ్రత్తలు తీసుకోకుండా విజయయాత్రకు సిద్ధమవ్వడంతో పోలీసు కేసు.. ఆపై చిన్నస్వామి స్టేడియంపై ఆంక్షలు విధించింది కోర్టు. అంతే.. పోలీసులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆ మైదానంలో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ కూడా జరుగలేదు. అందుకే.. ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందే ఆర్సీబీని అమ్మేసి.. చేతులు దులిపేసుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ.

## శ్రీలంక పాలిట విలన్‌లా వరుణుడు..
## వరుసగా మూడో మ్యాచ్ రద్దయ్యేనా?

స్వదేశంలో జరుగుతున్న వన్డే వరల్డ్ కప్‌లో శ్రీలంకకు బోణీ కష్టాలు తప్పడం లేదు. సొంతగడ్డపై అదరగొడుతూ పాయింట్ల ఖాతా తెరవాలనుకుంటున్న లంకను వరుణుడు వెంటాడుతున్నాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో జరిగాల్సిన మ్యాచ్‌లు వాన కారణంగా రద్దు అయ్యాయి. ముచ్చటగా మూడోసారి కూడా శ్రీలంక మ్యాచ్‌కు వర్షం అడ్డుపడింది. ఒకవేళ ఆట సాధ్యం కాకుంటే లంక కొంప కొల్లేరు అయినట్టే. ఎందుకుంటే.. ఇప్పటికే రెండు పాయింట్లతో సెమీస్ రేసులో వెనకబడిన చమరి ఆటపట్టు బృందానికి ఇది మింగుడుపడని విషయమే.



కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో శుక్రవారం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన చమరి ఆటపట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. లంక ఇన్నింగ్స్ 12 ఓవర్లు పూర్తి కాగానే వాన అందుకుంది. భారీగా చినుకులు పడడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికీ లంక స్కోర్ 462. కవిశ దిల్హరి(6), హర్షిత సమరవిక్రమ(5)లు అజేయంగా క్రీజులో ఉన్నారు. 4:15 గంటలకు వాన తెరిపినివ్వడంతో ఇరుజట్ల ప్లేయర్లు హమ్మయ్య అనుకున్నారు. కానీ, మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో ఆట సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ మ్యాచ్ కూడా వర్షార్పణం అయితే.. లంక కంటే దురదృష్టమంమైన జట్టు ఇంకోటి ఉండదేమో.

## ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన
## సీఐ మంజునాథ రెడ్డి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17 :**
గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని యర్రమ్రెడ్డిపాలెం ఆటో స్టాండ్‌ను శుక్రవారం రూరల్ సీఐ మంజునాథరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడి, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, రోడ్డు భద్రతా చర్యలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు.సామాజిక బాధ్యతతో ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటించి, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా, టీడీపీ యూత్ నాయకులు కిరణ్, ఆటోయూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామికి విశేష అభిషేక పూజలు




**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 17:**
పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆఖరి శుక్రవారం ఏకాదశి ఆశ్వయుజ మాసం సందర్భంగా విశేషా, అభిషేక పూజ నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి స్వామివారికి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉబయదారులుగా కమ్మపల్లి వాస్తవ్యులు పూజా కార్య క్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143